www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్ 2025
5
తూర్పుగోదావరి





గుడ్‌ఫ్రైడే సందర్భంగా తాళ్లపూడి మండలంలో శిలువ యాత్రను నిర్వహిస్తున్న క్రైస్తవులు

గ్రాసం కరువు... పోషణ బరువు

ఆందోళనలో పశు పోషకులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పశుగ్రాసం కొరత పశుపోషకులను వేధిస్తోంది. అనేక గ్రామాల్లో పశుగ్రాసం కోసం మూగజీవాలు అల్లాడుతున్నాయి. గుప్పెడు మేత కోసం పోటీ పడుతున్నాయి. ఇంటి నుంచి మేతకు వెళ్లిన పశువులకు గ్రాసం దొరకక బక్కచిక్కి పోతున్నాయి. దీంతో రైతులు పశువులను అమ్ముకుంటున్నారు. గతంలో పక్కానికి వచ్చిన వరి పంటను కూలీలు కోసేవారు. ధాన్యాన్ని నూర్పిడి వరిగడ్డిని కట్టలుగా కట్టేవారు. రైతులు వాటిని గడ్డివాములుగా పేర్చేవారు. కరువు కాటకాలు ఏర్పడిన పశువులకు అంతగా గ్రాసం కొరత ఉండేది కాదు. కానీ ప్రస్తుతం కూలీల కొరత, దానికి తోడు యంత్రాల వినియోగం పెరగడంతో గ్రాసం కొరత ఏర్పడుతోంది. యంత్రాలు కోయడం వల్ల చాలినంత గడ్డి లభ్యం అవడం లేదు.

యాంత్రీకరణతో మరింత ప్రభావం

అధికారుల గణాంకాల ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పాలు ఇచ్చే ఆవులు 7,841 ఆవులు, గేదెలు 3,261 ఉన్నాయి. ఏడాదికి 9,378 టన్నుల పాల దిగుబడి వస్తుంది. పాల ఉత్పత్తుల విక్రయం రైతులకు ఆర్థికంగా ఊతమిచ్చేది. దశాబ్దకాలంగా ఈ రంగంలో తీవ్ర మార్పులు వచ్చాయి. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా యంత్రాల వినియోగం గణనీయంగా పెరిగింది. పశువులకు ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్ల వినియోగం పెరిగింది. అత్యధిక మంది రైతులు మిషన్ల ద్వారా తమ పంటను కోయిస్తున్నారు. కూలీలు ఎకరంలో ధాన్యం నూర్పిడి చేసినందుకు రూ.9వేలు తీసుకుంటున్నారు. అంత కన్నా యంత్రాలకు తక్కువ ఖర్చు కావడంతో రైతులు అటుగా మళ్లుతున్నారు. యంత్రాలతో ఎకరం కోసినందుకు ట్రైన్ మిషన్‌కు రూ. 2,500 నుంచి రూ.3వే ఖర్చవుతోంది. చైన్ మిషన్‌తో గంటకు రూ.4వేలు ఖర్చవుతోంది. యంత్రాల కోత నేపథ్యంలో నాణ్యమైన గడ్డి రావట్లేదు. దీనికి తోడు తక్కువగా వస్తుంది.

పంట దిగుబడులపైనా ప్రభావం

పశువులు ఎక్కువగా ఉండటంతో అవి గడ్డి తిని వేసే పేడతో పొలాలన్నీ సారవంతమయ్యేవి. పంటలు కూడా బాగా పండేవి. కానీ నేడు ఆ స్థాయిలో పశువులు లేకపోవడంతో పొలాలన్నీ నిస్సారమవుతున్నాయి. భూమిలో అంతగా జవసత్వం లేకపోవడంతో పంటల దిగుబడి కూడా అంతంతమాత్రంగా ఉంటోంది. ఒకప్పుడు పొలాలను నాగళ్లతో దున్నేవారు. పశువులను ఉపయోగించేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. పశువుల స్థానంలో ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు పశువుల వినియోగం కూడా తగ్గింది. కొందరయితే పొలంలో దమ్ము చేసే సమయంలో గొర్రు తోలేందుకు కూడా ట్రాక్టర్‌నే వినియోగిస్తున్నారు. దీనివల్ల పశువుల వినియోగం తగ్గడం, యంత్రాలతో వరి కోయిస్తుండటంతో గ్రామంలో రైతు చక్రం దారి తప్పింది. పశువులంటే మక్కువ ఉన్న రైతులు కూడా ప్రస్తుతం వాటిని సరిపడా గ్రాసం అందించలేక అమ్ముకుంటున్నారు. ఒకప్పుడు పొలాల నిండా పశువులే కన్పించేవి. కానీ ప్రస్తుతం అంతంతమాత్రంగా ఉన్న పశువులతో ఒకప్పటి సందడి వాతావరణం కళ తప్పింది.



పశువులను అమ్మకానికి తరలిస్తున్న పాడి రైతులు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

పల్లెల్లో పశువుల సంఖ్య గత దశాబ్దకాలంగా గణనీయంగా తగ్గిపోతోంది. రైతులకు వ్యవసాయంతో పాటు పశు పోషణతో ఆర్థికంగా కొంత ఊరట లభించేది. ట్రాక్టర్ గడ్డి ప్రస్తుతం రూ.22వేలు ధర ఉంది. దాణా ఖర్చులు కూడా ప్రతి ఏటా అధిక మవుతున్నాయి. ఫలితంగా పశుపోషణ భారంగా మారింది. దాణా ఉచితంగా లేదా సబ్సిడీపై ఇవ్వాలి. పశు పోషకులను ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- కె.రాము, పాడి రైతు, తొర్రేడు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉమామహేశ్వరరావు, సిఐటియు నాయకులు

కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలనే డిమాండ్‌పై దేశవ్యాప్తంగా మే 20 జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమా మహేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సిఐటియు జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లేబర్ కోడ్స్ వల్ల కార్మిక వర్గానికి జరిగే ప్రమాదాలు, నష్టాలనుతెలిపే పుస్తకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మే 28న దేశవ్యాప్తంగా 11 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక సమ్మె జరుగుతుందన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలనే డిమాండ్‌ను కార్మిక వర్గం ఐక్యంగా కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికగా తెలియజేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా, ఇప్పుడున్న కార్మికుల హక్కులు కూడా లేకుండా కార్మికులను పూర్తిగా అణచి ఉంచేందుకు చూస్తుందన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా దేశంలో మొత్తం కార్మిక వర్గం కదులుతుందన్నారు. చట్టాలు ఆధునీకరిస్తున్నామని పైకి చెబుతూ 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ పేరుతో హరించే కుట్ర చేస్తుందన్నారు. దీనిని కార్మిక వర్గం తిప్పికొట్టాలన్నారు. అందుకు మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని అందకు కార్మిక సంఘాలు ఇప్పటి నుంచే సన్నాహాకాలు చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పవన్



సిఐటియూ జిల్లా విస్తృత సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.పవన్‌ను జిల్లా నాయకత్వం ఏకగ్రీవంగా ఎన్నుకుందని సీనియర్ నాయకులు ఎస్ఎస్. మూర్తి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుందర్‌బాబు, బి.పవన్, జిల్లా కోశాధికారి కెఎస్‌వి.రామచంద్రరావు, జిల్లా ఆఫీస్ బ్యారర్స్ ఎస్ఎస్.మూర్తి, టి.అరుణ్, కె.రామకష్ణ, కె.బేబిరాణి, బివిఎన్.పూర్ణిమరాజు, ఎం.వెంకటలక్ష్మి, జి.కృష్ణ, దుర్గారావు, సత్యనారాయణ, రవి, అన్నామణి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ట్రాన్ జెండర్ల హక్కులు, సమస్యలపై శనివారం సదస్సు నిర్వహించారు. లోక్ అదాలత్ జిల్లా పర్మినెంట్ చైర్మన్ ఎ.గాయత్రిదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఈ సందస్సును నిర్వహించారు. డిఎల్ఎస్ఎ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లకు భారత రాజ్యాంగం ద్వారా, సుప్రీం కోర్టు ఆదేశాల ద్వారా అందించిన హక్కులను వివరించారు. వారి పట్ల ఎవరూ వివక్ష చూపరాదన్నారు. స్త్రీ, పురుషులకు సమంగా వారికీ అన్ని హక్కులూ ఉన్నాయని తెలిపారు. హక్కులను వినియోగించుకుని అభివృద్ధి సాధించాలని వారికి సూచించారు. స్వయం ఉపాధి కోసం అందుబాటులో ఉన్న సబ్సిడీల గురించి వివరించారు. ఈ విషయంలో వారికి ఎలాంటి సహకారం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డిఎస్‌పి కె.రమేష్‌బాబు, రాజమహేంద్రవరం అసిస్టెంట్ సివిల్ సప్లయీస్ ఆఫీసర్, డిప్యూటీ డిఎంహెచ్ఒ, వెల్ఫేర్ ఆఫ్ ట్రాన్స్ జెండర్ల అధికారులు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, మెప్మా అధికారులు, లీగల్ అయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సభ్యులు, సాతి ఆర్గనైజేషన్ సభ్యులు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్‌జెండర్లతో సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

ఉన్నత స్థానాలు సాధించాలి : సర్పంచ్ రాంబాబు

తాళ్లపూడి : క్రీడల్లోనూ, చదువులోనూ రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని గజ్జరం సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు విద్యార్థులకు సూచించారు. గ్రామంలో వెల్ కేర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సుమారు 2వేల మందికి విందు ఏర్పాటు చేశారు. అతిథులుగా పిట్టా శ్రీనివాస్, మరిచర్ల శ్రీనివాస్, పాలపర్తి రమణ, బోడిగడ్ల గోవిందు హాజరయ్యారు. అంబేద్కర్ యువజన సంఘాల సభ్యులు, గ్రామంలోని యువకులు కుల మతాలకతీతంగా ఈ విందులో పాల్గొన్నారు.

3వ శనివారం 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పి.ప్రశాంతి తెలిపారు. ఏదొక గ్రామం లేదా మున్సిపల్ కార్యాలయం పరిధిలో శానిటేషన్, డ్రెయినేజీ క్లీనింగ్ కార్యక్రమంలా కాకుండా ప్రజల్లో చైతన్యం కలిగించేలా తీర్చిదిద్దుతామన్నారు. 'తక్కువ వ్యర్థాలు ఉండేలా, తిరిగి వినియోగించాలి, వ్యర్థాలు తగ్గించాలి' అనే 'ఆర్ఆర్ఆర్' కాన్సెప్ట్‌తో కార్యక్రమాన్ని రూపొందించామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. అందులో భాగంగానే ఈ శనివారం 'ఈ-వేస్ట్ మేనేజ్‌మేంట్'తో కూడిన కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. కార్యాలయాల్లో, గహాల్లో వృథాగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను మున్సిపల్, గ్రామ పంచాయతీలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ సేకరణ కియోస్క్‌ల వివరాలు తెలుసుకుని అక్కడ అందించాలన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వల్ల వాతావరణం కాలుష్యం అవుతుందన్నారు. తద్వారా పలు అనారోగ్య సమస్యను ఎదుర్కొనాల్సి వస్తుందని తెలిపారు. శనివారం జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె ప్రజలను కోరారు. స్థానిక రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉన్న వైటిసి భవనంలో జిల్లా స్థాయి స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.

గ్రంథాలయ పునర్వికాసాన్ని సాధిద్దాం...

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గ్రంథాలయ పునర్వికాసాన్ని సాధిద్దామని గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ తెలిపారు. రాజమహేంద్రవరంలోని గోదావరి బాలోత్సవం కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల ప్రారంభ సభ శుక్రవారం జరిగింది .ఈ కార్యక్రమానికి అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి స్వామిప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా వల్లూరు శివప్రసాద్ హాజరై మాట్లాడారు. సాహిత్య, సాంస్కతిక, రాజకీయ, మానసిక వికాసానికి తోడ్పడుతున్న గ్రంథాలయాలు కనీస సౌకర్యాలు లేక దీనావస్థలో ఉన్నాయన్నారు. గ్రంథాలయ పునరుజ్జీవనం ద్వారా వెలుగులు నింపే బాధ్యత నేటి సమాజంపై ఉందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలు చెల్లించే ఆస్తి పన్నుల్లో 8 శాతం గ్రంథాలయ సెస్ కలిసి ఉంటుందన్నారు. ఆ నిధుల్ని గ్రంథాలయాల్లో కొత్త పుస్తకాలు, ఫర్నిచర్, నూతన సాంకేతిక గ్రంథాలయ వనరులను సమకూర్చడానికి, సిబ్బందిని నియమించడానికి ప్రభుత్వం కషి చేయాలని ఆయన కోరారు. వసతులు కల్పన, గ్రంథాలయ సిబ్బంది నియామకం కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిందన్నారు. వెంటనే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో చేపట్టిన సంస్కరణ ఉద్యమం, గ్రంథాలయం ఉద్యమం అందించిన స్ఫూర్తితో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం సాగించే కర్తవ్యం అందరిపైనా ఉందన్నారు. ఈనెల 27 ఆదివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర సదస్సు జరుగుతుందని, దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రథమ అధ్యక్షులు డాక్టర్ చల్లా రవికుమార్, బాలోత్సవ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తులసి, సాహితీవేత్త డాక్టర్ పివిబి.సంజీవరావు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు లోలభట్టు శ్రీనివాసరాజు, సాహితీవేత్త డాక్టర్ బిహెచ్‌పివి.రమాదేవి సీనియర్ న్యాయవాది తోరాటి వసంతరావు, జెవివి జిల్లా అధ్యక్షులు కందికట్ల భీమయ్య, కార్యదర్శి జి.తాతారావు, ప్రముఖ కవి చింతలపూడి శ్రీనివాస భరద్వాజ్, ప్రజా సంఘాల నాయకులు దాసరి శివ, బి.పవన్, ఓబులేసు, షేక్ మీరా, పూర్ణిమ రాజు, భాస్కర్, పావనమూర్తి, రాంబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

పాముకాటుకు గురైన మహిళకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సీతానగరం

ముగ్గళ్ళ గ్రామంలో ఉపాధి హామీ పని చేస్తుండగా పాముకాటుకు గురై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతన్న జనసేన పార్టీ 'నా సేన కోసం నా వంతు' కో-ఆర్డినేటర్, ఎంఎల్ఎ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి ఆర్థిక సాయం అందించారు. విషయం తెలుసుకున్న ఆమె వెంటనే ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యర్తలు జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -దేవరపల్లి

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా దేవరపల్లి మండలం యర్నగూడెం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలో సిబ్బందికి విద్యుత్ వల్ల కలిగే అగ్ని ప్రమాదాలు, పామ్ ఆయిల్ గెలలు, వాటి పీచు వల్ల సంభవించే అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదం సంభవిస్తే తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ప్రమాద నివారణా పరికరాలు ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మిల్లు జనరల్ మేనేజర్ కరూటూరి రామకృష్ణారావు మేనేజర్ అనపర్తి శివరామకృష్ణ, సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ ఎస్.బాలగాయత్రి, సేఫ్టీ ఆఫీసర్ హేమాచలం, అగ్నిమాపక దళ సిబ్బంది, ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.

పురుషోత్తంపట్నంలో పోలీసుల నాకాబందీ

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో పురుషోత్తంపట్నంలో పోలీసులు శుక్రావరం నాకాబందీ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి తొమ్మిది గంటల నుంచి పన్నెండు గంటల వరకూ అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్‌కుమార్ మాట్లాడుతూ డిజిపి ఆదేశాలు మేరకు ఎస్‌సి నరసింహకిశోర్ సూచనలతో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇది ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు.

పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

మాంటిస్సోరి వార్షికోత్సవంలో ఎస్ఐ రామకృష్ణ

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరాలంటే పాఠశాల యాజమాన్యమే కాకుండా తల్లిదండ్రుల బాధ్యత, పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని ఎస్ఐ టి.రామకృష్ణ అన్నారు. తాళ్లపూడిలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఆవరణలో పాఠశాల 23వ వార్షికోత్సం శుక్రవారం జరిగింది. దీనికి ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు సెల్ ఫోన్లను దూరంగా ఉంచాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలు నిజమని అనుకుంటూ విద్యార్థులు చెడు అలవాట్లకు లోనవుతున్నారన్నారు. పాఠశాల వ్యవస్థాపక కరస్పాండెంట్ అనీష్ మాట్లాడుతూ 2002లో తమ పాఠశాల 23 మంది విద్యార్థులతో ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం 900 మంది విద్యార్థులతో కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆలోచనతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు, ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు ఒక్కరోజు కూడా బడికి మానకుండ వచ్చిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రాష్ట్రాల సంప్రదాయ దుస్తులు, నైతిక విలువలు తెలిపే ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనీష్ దంపతుల జ్యోతి ప్రజ్వలనతో వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

విలువలతో కూడిన విద్య 'బాపూజీ' లక్ష్యం


ప్రజాశక్తి-గోపాలపురం

క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించి విద్యార్థులను గొప్ప ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూలు లక్ష్యమని కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తమ పాఠశాలలో నర్సరీ నుంచి ఏడో తరగతి వరకూ విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు విద్యార్థులకు ప్రణాళికతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు ఎంతో మంది తమ విద్యార్థులు గొప్ప విద్యావేత్తలుగా, ఉన్నతమైన కొలువుల్లో స్థిరపడినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకుట్టకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకదుర్గ, శ్రీవిద్య, రేవతి, సునీత, అనూష, స్వప్న, చంద్రకళ విద్యార్థులు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కరస్పాండెంట్

కార్టూ'నిజం'





ఉత్తమ మార్కులు సాధించిన విద్యారస్త్రథలతో కరస్పాండెంట్

ఉత్తమ పౌరులను తయారు చేయడమే ధ్యేయం

ప్రజాశక్తి- గోపాలపురం

విద్యార్థులను గొప్ప విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు వారికి నైపుణ్యాలు, జ్ఞానం అలవర్చి ఉత్తమ పౌరులుగా దేశాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తులుగా తయారు చేయడమే గ్రే ఫియర్ కళాశాల లక్ష్యమని కరస్పాండెంట్ ఫాదర్ అలెక్స్, ఇన్‌ఛార్జి ఫాదర్ సిబ్బి అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో దొండపూడిలోని గ్రే ఫియర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటారు. ఆ విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు విద్య, నైపుణ్యాలు, జీవితానికి అవసరమైన జ్ఞానాన్ని అందించడంతోనే దేశ అభివృద్ధిలో భాగస్వాములు అవుతారన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, ఫాదర్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముంపునకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - గోపాలపురం

వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతున్న రజకుల పేటకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. శుక్రవారం రజకులపేట వద్ద, నేషనల్ హైవే వద్ద ముంపునకు గురవుతున్న ప్రాంతాలనుఆయన పరిశీలించారు. కల్వర్టులు, డ్రెయినేజీల నిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ పి.బంగారయ్య, పిఆర్ ఎఇ పవన్‌లను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాదాలకుంట, కోమటికుంట గోపాలపురం పరిసరాల ప్రాంతాల నుంచి వర్షాకాలంలో వరద అత్యధికంగా వస్తుందన్నారు. దీంతో లోతట్టు ప్రాంతమైన రజకుల పేట ప్రతి ఏడూ ముంపునకు గురవుతుందన్నారు. ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. వరద నీటి ప్రవాహానికి తగినంత సామర్థ్యం గల కల్వర్టులు, డ్రెయినేజీలు లేకపోవడం వల్లే ముంపునకు గురవతున్నట్టు గుర్తించామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రానున్న వర్షాకాలం నాటికి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని తెలిపారు. రూ.కోటితో కల్వర్టులు, డ్రెయినేజీలు నిర్మిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

నేరాలు ఘోరాలు

గుర్తుతెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- మామిడికుదురు

మామిడికుదురు 216వ జాతీయ రహదారిలో గ్రోప్రస్ ఎదురుగా శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీ కొని పెదపట్నం లంక గేడ్డం వారి పేటకు చెందిన బూల వెంకటరత్నం(34) అక్కడకక్కడే మృతి చెందాడు. వివరాలు ఇవి.. మోటార్ సైకిల్‌పై కరెంటు సామాన్లు కోసం వెంకటరత్నం మామిడి కుదురు వస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదానికి గురయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు మతునికి ఏడేళ్ల క్రితం లక్ష్మీ దుర్గ తో వివాహమైంది. అతనికి ఆరేళ్ల భరత్ సాయి, రెండేళ్ల మాధురి లక్ష్మి సంతానం. హైదరాబాద్లో సిఎంఆర్ లో పనిచేస్తున్న వెంకటరత్నం మూడు రోజుల సెలవులు రావడంతో స్వగ్రామము వచ్చి రోడ్డు ప్రమాదంలో మతి చెందడం కుటుంబ సభ్యులను కలచివేసింది. కుటుంబ యజమాని మృతితో తమ జీవనోపాధి కోల్పోయామ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. ఈ ఘటనపై నగరం ఎస్ఐ చైతన్య కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గళ్లలో చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

ముగ్గళ్ల గ్రామంలో శుక్రవారం చోరీ జరిగింది. బాధితులు కూచిపూడి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ చోరీ జరిగిందన్నారు. బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు, కాసు బంగారు సూత్రం, ఇత్తడి గొలుసు, వెండి సామగ్రి, గ్యాస్ బండ చోరీకి గురయ్యాయన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గుర్తుతెలీని మహిళ మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని ఎర్రవరం ఏలేరు కాలువలో గుర్తు తెలీని 50 ఏళ్ల పైబడిన మహిళ మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు తెలిపిన వివరాలివి. ఎర్రవరం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఏలేరు కాలువలో 50 ఏళ్లు పైబడిన మహిళ మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో లభించిందన్నారు. మృతురాలు లేత ఆకుపచ్చ రంగు జాకెట్టు, ముదురు ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉందన్నారు. ఎర్రవరం విఆర్ఓ ఎం.అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బంధువులు గుర్తింపు నిమిత్తం ప్రతిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ నెంబర్ 08868 224033, లేదా 9440904835 నంబర్లకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

నగరం కళాకారునికి డాక్టరేట్

ప్రజాశక్తి - మామిడికుదురు

'నగరం' గ్రామానికి చెందిన బుర్ర కథ కళాకారుడు మంగం సత్యనారాయణ గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. హైదరాబాదులో డాక్టర్ ఎన్‌టిఆర్ కళామందిర్‌లో గురువారం జరిగిన సమావేశంలో పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ప్రతిష్టాత్మకమైన డాక్టరేట్ అవార్డుతో మంగం సత్యనారాయణను సత్కరించింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్స్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. డాక్టరేట్ అందుకున్న సత్యనారాయణను శుక్రవారం గ్రామం లో పలువురు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి పనులు పూర్తి స్థాయిలో కల్పించాలి

ప్రజాశక్తి-కాజులూరు

ఉపాధి కూలీలకు పనులు పూర్తిస్థాయిలో కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని శీలలంక, ఒంటితాడి గ్రామాల్లో ఉపాధి కూలీల సమస్యలపై ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధి కూలీలకు విరివిగా పనులు కల్పించేందుకు మండల స్థాయి అధికారులు చేస్తున్న కృషికి స్థానిక పంచాయతీలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలకు ఏప్రిల్ ఒకటి నుండి పనులు కల్పించవలసిన అవసరం ఉందని కొన్ని అనివార్య కారణాల వల్ల పనులు కల్పించడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. మండలంలో కొన్ని గ్రామాలలో పనులు ప్రారంభించారని, కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి వేతనాలు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పెద్దాపురం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో పలు పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎడిఎఫ్ఓ ఎం.శ్రీహరి జగన్నాథ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది పరిశ్రమలలో పని చేసే కార్మికులకు అగ్ని ప్రమాదాలు జరగకుండా పని చేసే ప్రదేశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను ఆర్పే విధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్మికులతో మంటలను ఆర్పే విధానాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం ఎల్ఎఫ్‌లు ఎన్.గీతాప్రసాద్, జి.దుర్గాప్రసాద్, డిఒపిహెచ్.నాగేశ్వర్, ఎఫ్ఎంలు డి.నానాజీ, ఎండి.యాకూబ్, ఎం.రాజు పాల్గొన్నారు.

పిఠాపురం అగ్నిమాపక వారోత్సవాలో భాగంగా స్థానిక బైపాస్‌లో ఉన్న జెజిఆర్ ఫ్యూయల్ పెట్రోల్ బంక్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి డి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖల ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పెట్రోల్ లేదా డీజిల్ ఫిల్లింగ్ చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

ఆక్రమణల చెరలో శివకోడు జాతీయ రహదారి

ప్రజాశక్తి - రాజోలు

మండలంలోని శివకోడు పంచాయతీ పరిధిలో శివకోడు జాతీయ రహదారి 216 పై మూలమామిడి సెంటర్‌లో జాతీయ రహదారి216 ని ఆక్రమణలకు గురైంది. ఆక్రమణలతో పాటు రహదారి మలుపులో వ్యాపారం చేసుకునేలా వ్యాపార దుకాణాలు, రహదారికి అడ్డంగా అక్రమ నిర్మాణాలను నిర్మించారు. అయినప్పటికీ నేషనల్ హైవే అథారిటీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఆక్రమణల విషయమై స్థానిక రెవిన్యూ అధికారులను సంప్రదించగా రెవెన్యూ వారికి ఏమి సంబంధమని రాజోలు తహశీల్దార్ అన్నారు. హైవే ఆక్రమణలపై స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజోలు మండలంలో జాతీయ రహదారి 216 పై పలుచోట్ల ఆక్రమణలు జరిగి అక్రమ నిర్మాణాలు చేపట్టినప్పటికీ నేషనల్ హైవే అథారిటీ, రెవిన్యూ అధికారులు మౌనం వహించడం పట్ల స్థానిక ప్రజలలో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.



జాతీయ రహదారి 216పై మూలమామిడి సెంటర్‌లో ఏర్పాటైన వ్యాపార దుకాణాలు, అక్రమ నిర్మాణాలు

సేవా కార్యక్రమాలకు ఓఎన్‌జిసి చేయూత

ప్రజాశక్తి -మామిడికుదురు

సామాజిక సేవా కార్యక్రమాలకు ఓఎన్‌జిసి చేయూతనిస్తుందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతన్ దాస్ అన్నారు అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని శుక్రవారం ఆయన చీఫ్ జనరల్ మేనేజర్ హెచ్ఆర్.రామారావు తో కలిసి, కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వాదం అందజేశారు ఆలయ సహాయ కమిషనర్ ఎం. సత్యనారాయణ రాజు ఇడికి నూతన వస్త్రాలు బహూకరించి స్వామివారి ప్రసాదం అందజేశారు అనంతరం ఆలయ ఆవరణలో ఓఎన్‌జిసి నిధులు రూ.ఐదు లక్షలతో నిర్మిస్తున్న వాటర్ ప్లాంట్ ను పరిశీలించి, నిర్మాణ పనుల తీరు అడిగి తెలుసుకున్నారు దీనిని త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు. ఆయన వెంట స్థానిక ఓఎన్‌జిసి అధికారులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ ను పరిశీలిస్తున్న ఓఎన్‌జిసి ఇడి శాంతన్ దాస్

కుట్టు శిక్షణ ద్వారా మహిళలకు చేయూత

ప్రజాశక్తి – ఆలమూరు

ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణతో మహిళలకు చేయూతనందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉదని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని చొప్పెల్ల, ఆలమూరులలో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఎ.రాజులతో కలిసి కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో కటింగ్, స్టిచ్చింగ్ లబ్ధిదారులకు నేర్పిస్తారని అన్నారు. ౦. అలాగే 75 శాతం హాజరు తప్పక ఉండాలని వారికి ఉచితంగా మిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఇదంతా మీ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ రెండు కేంద్రాల ద్వారా సుమారు 300 మంది మహిళలకు లబ్ది చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఆలమూరు డిసి అధ్యక్షులు మెర్ల గోపాలస్వామి, జనసేన మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, సర్పంచులు దంగేటి చంద్రకళ బాపనయ్య, నాతి లావణ్య కుమార్ రాజా, కార్యదర్శులు ఎం.వెంకటరెడ్డి, కె.మోక్షంజలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చొప్పెల్లలోని కుట్టు శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యానందరావు

ఇసుకను అందుబాటులో ఉంచాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రానున్న వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో డీసిల్టేషన్, ఓపెన్ రీచ్‌లు, సెమీ మెకానైజ్డ్ పాయింట్స్ ద్వారా తవ్వకాలు చేపట్టి 12 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను 45 రోజుల్లోగా గుర్తించిన స్టాక్ యార్డుల్లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇసుక సరఫరా విధానంపై ఏజెన్సీల ప్రతినిధులతో జెసి ఎస్.చిన్నరాముడు, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ బివి.గిరిలతో కలిసి కలెక్టరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తు నిర్మాణాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తసుకోవాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో స్టాక్ యార్డులను గుర్తించి అక్కడ ఇసుక నిల్వలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందు కోసం ప్రభుత్వం గుర్తించిన లేదా ఏజెన్సీస్ గుర్తించిన స్థలాల్లో ఆయా స్టాక్ యార్డులకు అనుమతి ఇస్తామన్నారు. ఏజెన్సీలు స్వయంగా స్టాక్ యార్డులను నిర్వహించేందుకు ముందుకొస్తే ఆ మేరకు అనుమతి ఇస్తామన్నారు. రానున్న రెండు రోజుల్లో అంగీకారం, స్థలం వివరాలను రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఆయా భూములకు మార్గదర్శకాలు అనుసరించి అద్దె చెల్లిస్తామన్నారు.

రిజర్వు చేసిన ఇసుక నిర్దిష్ట సోర్స్ పాయింట్ వద్ద కార్యకలాపాల ఖర్చు ఆధారంగా జిల్లా స్థాయి ఇసుక కమిటీ ద్వారా బేస్ రేటును నిర్ణయిస్తుందన్నారు. అంతకంటే ఎక్కువ ధరకు వినియోగదారునికి ఇసుక సరఫరా చేయడం ఉల్లంఘన కింద పరిగణనలోకి వస్తుందన్నారు. ధర నిర్ణయించే క్రమంలో మాన్యువల్ రీచ్/ సెమీ-మెకనైజ్డ్ రీచ్, డీ సిల్టేషన్ పాయింట్ ఆధారంగా ఏజెన్సీస్ గతంలో కోట్ చేసిన ధర ఆధారంగా ఉంటుందన్నారు. ఆయా రీచ్ పాయింట్స్ ఆధారంగా ధర భిన్నంగా ఉంటుందన్నారు. వినియోగదారులకు ఇసుకను సరఫరా చేసే తుది ధర బేస్ రేటును అనుసరించి నిర్ణయిస్తామని తెలిపారు. జియో మ్యాపింగ్ ఆధారంగా కాకుండా రీచ్ పాయింట్స్ నుంచి స్టాక్ యార్డు వరకు ఉన్న దూరాన్ని వాస్తవంగా నిర్ధారణ చేస్తామన్నారు.

ఇసుక సరఫరా విధానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ మార్గాల్లో ఏజెన్సీల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ ఐవిఆర్ఎస్ ద్వారా చేపడతామన్నారు. స్టాక్ పాయింట్ నిర్వహణ, అమ్మకాల విషయంలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

కూటమి హయాంలో ప్రభుత్వాసుపత్రి ప్రక్షాళన

ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

గత ఐదేళ్ల వైసిపి పాలనలో వెంటిలేటర్‌పై ఉన్న రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిని కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చిన పది నెలల్లో ప్రక్షాళన చేసి ఒక దారికి తెచ్చామని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కూటమి నాయకులతో కలిసి ఆయన ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే అసెంబ్లీ సాక్షిగా మాట్లాడి ఒక నోడల్ అధికారిని నియమించేలా చేశామని చెప్పారు. ఆ అధికారి ఎప్పటికప్పుడు రోగులు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవల కోసం చర్యలు చేపడుతున్నారన్నారు. తాను 15 రోజులకు ఒకసారి ఆసుపత్రిని సందర్శిస్తున్నానని తెలిపారు. మార్చురీ వద్ద మృతుల బంధువుల నుంచి డబ్బులు వసూలు చేయడాన్ని పూర్తిగా అరికట్టామన్నారు. రీల్స్ స్టార్ భరత్ మార్చురీ వద్ద జరుగుతున్న అవినీతి గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ప్రెస్ మీట్ పెట్టి తనను తిట్టడం తప్ప ఆయనకు వేరే పని లేదన్నారు. సమస్యలుంటే నిర్మాణాత్మకంగా ఎత్తి చూపాలని కాని ప్రచారం పిచ్చితో నోటికొచ్చినట్లు అవాస్తవాలు మాట్లాడడం తగదని హితవు పలికారు. గత వైసిప సర్కారు రూ.2వేల కోట్ల మేర ఆరోగ్యశ్రీ బకాయిలు పెట్టిందన్నారు. వాటిని తమ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. సిఎస్ఆర్ నిధులు పేపరు మిల్లు నుంచి రూ.1.20 కోట్లు వచ్చాయని, మరో రూ.40 లక్షలు రానున్నాయని తెలిపారు. నగరంలో బ్లేడ్ బ్యాచ్ గంజాయి బ్యాచ్ లను అణచివేశామని, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. నాగాంజలి ఆసు పత్రిలో ఉన్నప్పుడు దారిన వెళ్తున్న విద్యార్థులను ఆపి మాజీ ఎంపీ భరత్ వారితో ఆందోళన చేయించాడని, తాముమాత్రం ఆ కుటుంబానికి న్యాయం జరిగేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట అత్తి సత్యనారాయణ తదితరులున్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు, బెంచీల బహూకరణ

ప్రజాశక్తి - కె.గంగవరం

కొత్తకోట గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలకు గ్రామస్తుడు నామాన్ని సత్తిబాబు బెంచీలు, ఫ్యాన్లు, బీరువాలు, ప్రింటర్, గ్రీన్ బోర్డు తదితర ఫర్నీచర్ శుక్రవారం బహూకరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆయన ఏర్పాటు చేసిన బెం చీలు, ఫ్యాన్లు తదితర వస్తువులు ఉపయోగపడతాయని విద్యార్థులు తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్తపేటలో గల ప్రభుత్వ పాఠశాలకు అందజేసిన ఫర్నిచర్

శారీరక వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ప్రతిరోజు శారీరక వ్యాయామం చేయడం వల్ల మనక్కు మరింత శక్తితో పాటు సాధారణ ఆరోగ్యం మెరుగు పడుతుందని పోషకాహార నిపుణురాలు మల్లీశ్వరి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ వ్యాయామ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 18న జాతీయ వ్యాయామ దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. ప్రజలందరిలో వ్యాయామం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవ లక్ష్యమన్నారు. క్రమం తప్పకుండా శారీర వ్యాయామం చేయడాన్ని దినచర్యలో ఒక భాగంగా చేసుకోవాలన్నారు. వ్యాయామాలలో సులభమైంది వాకింగ్ అన్నారు. ప్రతిరోజు 30 నిమిషాల పాటు వాకింగ్ చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా అధిక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని మల్లీశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సలో ఫిజియోథెరపీ కీలక పాత్ర

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఆరోగ్య జీవనాన్ని కొనసాగించేందుకు నిర్దేశించిన ఒక ప్రముఖ వైద్య ప్రక్రియ ఫిజియోథెరపీ అని వైద్య చికిత్సలో ఈ వైద్య విధానం కీలక పాత్ర పోషిస్తుందని ఆ వైద్య నిపుణురాలు సత్యవాణి పేర్కొన్నారు. బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఛాతి, గుండె, కండరాల నొప్పులు, పక్షవాతం, అంగవైకల్యంతో పాటు క్యాన్సర్ వల్ల వచ్చే నొప్పులకు చక్కటి ఉపశమనం ఫిజియోథెరపీ ద్వారా లభిస్తుందన్నారు. పెద్ద ఖర్చు లేకుండా, శరీరాన్ని పాడు చేయకుండా చేసే వైద్యమే ఫిజియోథెరపీ అని సత్యవాణి తెలిపారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, యనమల రామం, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, ఎం.సుబ్బారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అసమానతల తొలగింపునకే రుణాలు

ప్రజాశక్తి-తుని

ఆర్థిక అసమానతలు తొలగించాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను మంజూరు చేస్తున్నట్టు మాజీ ఆర్థిక మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. శుక్రవారం తేటగుంట పార్టీ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి తోపాటు, తుని నియోజకవర్గ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తున్న కార్పొరేషన్ల రుణాలను పారదర్శంగా అందించాలని అధికారులకు సూచించారు. సచివాలయాల సిబ్బంది ఖాళీలను బట్టి సర్దుబాటు చేయాలని యనమల సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చింతమనేడు అబ్బాయి, మోతూ్కరు వెంకటేష్, తుని ఎంపిడిఒ కె.సాయి నవీన్, ఇఒపిఆర్‌డి జయరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి పనిచేయాలి

ప్రజాశక్తి-కిర్లంపూడి

వైసిపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. పార్టీ ప్రత్తిపాడు మండల నూతన కమిటీ ఉపాధ్యక్షుడుకిలాడి బాబ్జి, ఎగ్జిక్యూటివ్ మెంబెర్ సానా పోలరాజు శుక్రవారం గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జువ్వల చినబాబు, రాపా గుర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో 'కుడా' ఛైర్మన్ పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కుడా ఛైర్మన్ తుమ్మల బాబు కుటుంబ సమేతంగా శుక్రవారం పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలోని నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య ఆధ్వర్యంలో ఆలయ ఆసాదులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

గుంతల రోడ్డుకు ట్రాఫిక్ పోలీసుల మోక్షం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో గుంతల మయంగా ఉన్న రోడ్డుకు రిపేర్లు చేపట్టడంలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు చిరు సాయం చేశారు. స్థానిక స్టేషన్స్ సెంటర్లోని యతి హోటల్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారికి పడిన గుంతల కారణంగా వాహన దారులు ఇబ్బందులు పడుతున్న కారణంగా ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు జోక్యంతో దాత సహకారంతో కాంక్రీటుతో గోతులకు రిపేరు చేపట్టారు.

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-కాకినాడ

ఎస్‌సి వర్గీకరణను నిరసిస్తూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. రత్నాకర్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ ముసుగులో దేశవ్యాప్తంగా దళితుల ఐక్యతపై అన్ని రాజకీయ పార్టీలూ కుట్ర చేస్తున్నాయని చెప్పారు. అనంతరం చేపట్టిన ఒక్కరోజు దీక్షను ఆయన విరమించారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఇసుకపల్లి, ఎండపల్లిలో వ్యవసాయ శాఖ అధికారి ఎడిఎ పి.స్వాతితో కలిసి గ్రామాల్లో ఉన్న ధాన్యం కళ్లాలను వారు పరిశీలించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తారని, రైతులు ఎవరూ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పని లేదన్నారు. మద్దతు ధర కల్పించి రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. కార్యక్రమం లో వ్యవసాయ శాఖ అధికారులు ఎంఎఒ వి.జోగి రాజు, ఎఇఒ డి.నాగేంద్ర రైతులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రంలో ఆమె మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని దేవస్థానం తరుపున ఈ మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, పూజారి ఐవి.ప్రసాద్ శర్మ, తదితరులు సేవలందించారు.